ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 23 సెప్టెంబరు 2025


శ్రీకాకుళం మొండేటివారి వీధిలోని శివకామేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరి దేవిగా అలంకరణ


శ్రీకాకుళం ఏడురోడ్ల జంక్షన్ వద్ద విద్యుత్ వెలుగులో కనకదుర్గమ్మ ఆలయం

దుర్గమ్మ తల్లీ.. కరుణించవమ్మా!

- జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని.. జిల్లాలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా మంగళవాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు, బాంబుల మోత మధ్య దుర్గమ్మ విగ్రహాలను భారీ ఊరేగింపుగా తీసుకొచ్చి ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించారు. 11రోజుల పాటు అమ్మవారి పూజలకు కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేశారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గా మహాలక్ష్మి, తుల్జాభవానీ, విజయదుర్గమ్మ, లలితా శివకామేశ్వరి, నీలమ్మతల్లి, సంతోషిమాత, రాజరాజేశ్వరి పీఠం.. తదితర ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని చాలామంది భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. అలాగే ఏడురోడ్ల జంక్షన్, డేఅండ్‌నైట్ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వామ్మో.. అమెరికాలో ఉద్యోగమా?

- ట్రంప్ ఆంక్షలతో కూలుతున్న ఆశలు
- కొత్త వీసాదారులకు హెచ్-1బీ నిబంధన
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన



- మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన 9 మంది యువకులు గత మూడేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. వీరిలో ఐదుగురు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. నలుగురు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఏడాది గ్రామానికి చెందిన మరికొందరు అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని భావించారు. కాగా శనివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్1బీ వీసాలపై పెట్టిన ఆంక్షలతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వీసాల ఫీజు భారీగా పెంచేయడంతో ఏమిచేయాలో తెలియక సతమతమవుతున్నారు.

మెళియాపుట్టి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ తదితర చదువుల తర్వాత అమెరికా వెళ్లి ఉన్నత విద్యనభ్యసించి.. అక్కడే ఉద్యోగాలు చేసుకుంటూ స్థిర పడాలనుకుంటున్న వారి ఆశలు కూలిపోతున్నాయి. విదేశీయుల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న ఆంక్షలు కలవరపెడుతున్నాయి. గతంలో హెచ్1బీ వీసాకు 1500 డాలర్లు అంటే.. 1,32,000 చెల్లిస్తే సరిపోయేది. కానీ ఇప్పుడు ఏటా రూ.90లక్షలు చొప్పున కంపెనీలు చెల్లించాలని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. దీంతో అమెరికా ఉన్నత విద్య, ఉద్యోగం చేయాలనుకునేవారు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో శ్రీకాకుళం, పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పలాస, రణస్థలం, ఎచ్చెర్ల, మెళియాపుట్టి మండలాల నుంచి అధికంగా అమెరికాలో చదువుతోపాటు ఉద్యోగాలు చేస్తున్నారు. కొంతమంది గ్రీన్‌కార్డు పొంది అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. చాలామంది విద్యార్థులు ఎఫ్1 వీసాతో అమెరికా యూనివర్సిటీలో ఎంఎస్ లాంటివి చదివి ఐటీ రంగంతో పాటు ఇతర రంగాల్లో ప్రావీణ్యం పొందుతున్నారు. ఓపీటీ, స్టెమ్, తర్వాత అమెరికా కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. కొంతమంది హెచ్1బీ వీసాపై కొన్ని ఐటీ కంపెనీలతోపాటు మరికొన్ని కంపెనీల్లో కాంట్రాక్టర్ పద్ధతిలో ఉద్యోగాలు (మిగతా 6వ పేజీలో..)

జీఎస్టీ సంస్కరణలతో ఊరట

- ధరల తగ్గింపుపై అంతటా చర్చ
- జిల్లాలో తొలిరోజు మిశ్రమ స్పందన

శ్రీకాకుళం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చేశాయి. నిత్యావసర సరుకులు, వాహనాలు, ఇన్సూరెన్స్ పాలసీల... ఇలా వీటన్నింటిపై జీఎస్టీ తగ్గింది. ఈ క్రమంలో చాలా వస్తువుల ధరలు తగ్గాయనే చర్చ సాగింది. ధరలు తగ్గితే తమకు ఊరట లభించనుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. కాగా తొలిరోజు జిల్లావాసుల్లో మిశ్రమ స్పందన కనిపించింది. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, పాతపట్నం వంటి పట్టణాల్లోని షాపింగ్ మాల్స్‌లో కొనుగోలుదారులు పెద్దగా లేరు. కానీ నిత్యావసరాల సరుకులు, మందుల దుకాణాల వద్ద మాత్రం కాస్త రద్దీ కనిపించింది. జీఎస్టీ సవరణతో నిత్యావసర సరుకులకు సంబంధించి సుమారు 13శాతం వరకు ఆదా అవుతుంది. కిరాణా సామగ్రి, వ్యవసాయ పరికరాలు, వస్త్రాలు, మందులు, ఆటోమొబైల్స్ వంటివాటిలో 375 రకాల వస్తువుల ధరలు తగ్గాయి. జీఎస్టీ తగ్గింపుతోపాటు ఆదాయపు పన్నును రూ.12లక్షల వరకు మినహాయించడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించనుంది.

- మంచిరోజు కోసం ఎదురుచూపు

జిల్లాలో దసరా, దీపావళి సమయాల్లో చాలామందికి కొత్తవస్తువులు కొనుగోలు చేయడం సెంటిమెంట్. జీఎస్టీ సవరణతో కారులు, బైక్‌లు, ఏసీలు, టీవీల ధర బాగా తగ్గిందనే ప్రచారం సాగింది. రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్ల ధర కూడా తగ్గిందని సమాచారం అంతటా తెలిసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలుగులో జీఓ 582ను విడుదల చేసింది. ఏ వస్తువుపై ఎంతశాతం జీఎస్టీ తగ్గిందీ అన్నదీ.. అందులో స్పష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో నిత్యావసర వస్తువులతోపాటు.. కారులు, ఏసీలు, టీవీలు వంటి వాటిపై ధరలు ప్రస్తుతం ఎంత ఉన్నాయనే దానిపై ప్రజలు ఆరా తీస్తున్నారు. జీఎస్టీ ధరను తగ్గించి విక్రయిస్తున్నారో లేదోనని పరిశీలిస్తున్నారు. గందరగోళం లేకుండా త్వరలో మంచిరోజున అవసరమైన వాహనాలు, వస్తువులు కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. దీంతో తొలి రోజు జిల్లాలో పెద్దగా విక్రయాలు జరగ లేదు. అలాగే జిల్లా జీఎస్టీ అధికారులు కూడా ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రభుత్వ ఉత్తర్వులను అందరికీ పంపుతున్నారు.


నరసన్నపేట : బీమా పాలసీపై జీఎస్టీ రద్దుతో సంబరాలు చేసుకుంటున్న ఎల్ఐసీ ఉద్యోగులు, సిబ్బంది

మరిన్ని ఆఫర్లు

నరసన్నపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పలు వాహన షోరూమ్‌లు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. జీఎస్టీ తగ్గింపు ధరల వివరాలను ప్రదర్శిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. దసరాకు అత్యధికంగా ద్విచక్రవాహనాలు కొనుగోలు చేస్తారు. జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, కాశీబుగ్గ, టెక్కలి, ఆమదాలవలస తదితర పట్టణాల్లో ద్విచక్రవాహనాల కొనుగోలు ముమ్మరంగా సాగుతాయి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. దీంతో పలు షోరూమ్‌లు జీఎస్టీ తగ్గింపు ధరలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి.. బహుమతులు కూడా ప్రకటిస్తున్నాయి. దీంతో ఈసారి దసరాకు మరింత విక్రయాలు పెరగనున్నాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీ రద్దుతో సంబరాలు

బీమాపాలసీపై జీఎస్టీ రద్దుతో బీమా రంగానికి జీవం వచ్చిందని ఎల్ఐసీ డీవోలు, ఏజెంట్లు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నరసన్నపేట ఎల్ఐసీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయడం ద్వారా ప్రజలపై భారం తగ్గుతుందని, బీమా రంగం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నేతాజీ, డీవో వెంకటేశ్వరరావు, సంఘ నాయకులు గడ్డేసు, ఎల్వీ రమణ, పి.చంద్రశేఖర్, రమణయ్యరాజు, మెండ చిన్నవాడు పాల్గొన్నారు.

ఆక్రమణల జోరు.. పట్టించుకోరు

- టెక్కలిపట్నంలో దేవదాయశాఖ భూమి కబ్జా
- తర్లాకోటలో శ్మశానవాటికనూ వదలని వైనం
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

పలాస రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పలాస మండలంలో దేవదాయశాఖ, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. దేవదాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలాస మండలం తర్లాకోటలో సంస్థానాధీశులకు చెందిన శ్మశానవాటిక స్థలాన్ని కూడా అక్రమార్కులు వదలడం లేదు. ఒకప్పుడు ఈ శ్మశానవాటిక 29 సెంట్లు ఉండగా.. గత రెండేళ్లుగా క్రమేపీ 20 సెంట్లకుపైగా ఆక్రమించేశారు. దీనిపై గతంలో సమాచారం ఇచ్చినా సచివాలయం అధికారులు, వీఆర్వో, సర్వేయర్లు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇటీవల ఆక్రమణల విషయమై పలాస తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. కానీ (మిగతా 6వ పేజీలో..)


టెక్కలిపట్నంలోని దేవదాయ భూముల్లో ఆక్రమించిన నిర్మించిన షెడ్డు


చినమురపాకలో డాబాలవాని చెరువును ఆక్రమించి.. వరిసాగు

డాబాలవాని చెరువునూ వదల్లే

లావేరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): లావేరు మండలం చినమురపాకలోని డాబాలవాని చెరువు ఆక్రమణకు గురైంది. చెరువులో నీటి సామర్థ్యం తగ్గి తమ భూములకు సాగునీరు చాలడం లేదంటూ ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు గర్భం సుమారు 350 ఎకరాలు ఉండేది. ఈ చెరువు నీటి ఆధారంగా దాదాపు 750 ఎకరాల్లో ఆయకట్టు సాగు చేసేవారు. కాగా ఈ చెరువు క్రమేపీ ఆక్రమణకు గురవుతూనే ఉంది. పదేళ్ల కిందట గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆ చెరువు గర్భంలో చినమురపాక నుంచి పెదరొంపివలసకు మట్టిరోడ్డు వేశారు. అప్పటి నుంచి ఈ చెరువు రెండు భాగాలుగా విడిపోయింది. రోడ్డుకు (మిగతా 6వ పేజీలో..)



అక్కడ చవక.. ఇక్కడ ప్రియం

- రాయలసీమలో కిలో ఉల్లి 50పైసలే..
- జిల్లాలో మాత్రం పెరుగుతున్న ధరలు

టెక్కలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమాటా ధరలు హడలెత్తిస్తున్నాయి. సామాన్యులు కొనడానికి ఇబ్బంది పడే పరిస్థితి ఉంటోంది. ఉల్లి పండించే కర్నూలు, శంకరాపల్లె, సదాశివునిపేట తదితర రాయలసీమ ప్రాంతాల్లో కిలో 50పైసల వంతున లభిస్తుంటే... మన జిల్లాకేంద్రంలోని శ్రీకాకుళం రైతుబజారులో రూ.17, మిగిలిన ప్రాంతాల్లో రూ.20 నుంచి రూ.25 మధ్య వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి గోల్టీ, గోల్టా, బళ్లారి రకాల ఉల్లి జిల్లాకు వస్తోంది. జనవరి నుంచి మార్చి వరకు మహారాష్ట్ర నుంచి వస్తుంది. జిల్లాలో రోజుకు పది లారీల్లో సుమారు 300 టన్నుల ఉల్లి కర్నూలు ప్రాంతం నుంచి వస్తోంది. ఇది ఎక్కువగా గృహ అవసరాలు, హోటళ్లు, దాబాలు, వసతిగృహాలకు సరఫరా అవుతోంది. జంటపాయి, పేడు ఉల్లి, గోల్టా, గోల్టీ, బళ్లారి, ఇండియా బళ్లారి రకాల ఉల్లిని జిల్లాలో వినియోగిస్తున్నారు. కర్నూలు మార్కెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి ఇటీవల 60,570 క్వింటాళ్ల ఉల్లిని సేకరించింది. అందులో 3,707 టన్నులను వివిధ జిల్లాల్లో రైతుబజార్లకు పంపిణీ చేశారు. ఒక్క కర్నూలు మార్కెట్‌లోనే 2,350 టన్నుల ఉల్లి బస్తాలు కుప్పలుగా పడి ఉన్నాయి. కానీ ఇక్కడ పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. ధర అధికంగా ఉంటోంది.

టమాటా ధరలూ అంతే...

ఉల్లితోపాటు టమాటా ధరలూ పైపైకి చేరుకుంటున్నాయి. కిలో టమాటా హోల్‌సేల్‌లో రూ.25, రిటైల్‌లో రూ.30చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు కిలో టమాటా రూ.40 నుంచి రూ.50కి విక్రయిస్తున్నారు. మదనపల్లె, గుర్రంకొండ, కర్ణాటకలోని కోలార్ ప్రాంతం నుంచి జిల్లాకు రోజు పది వ్యాన్ల ద్వారా టమాటా చేరుతుంది. గృహ అవసరాలు, హోటళ్లు, దాబాలు, వసతిగృహాల్లో టమాటా వినియోగం ఎక్కువగా ఉండడంతో వీటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి.


ఇటీవల గొట్టాబ్యారేజీ దిగువన కోతకు గురైన పంట పొలాలను పరిశీలిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు, రైతులు

నది మింగేస్తోంది

- ఏటా వరద ముంపునకు గురవుతున్న పొలాలు
- ఆందోళనలో రైతులు

హిరమండలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు లక్షల ఎకరాలకుపైగా సాగు భూములకు నీరందించి.. జిల్లా రైతులకు వెన్నుదన్నుగా ఉన్న గొట్టాబ్యారేజీ హిరమండలం ప్రాంత రైతులకు మాత్రం తీవ్ర ఆవేదనను మిగులుస్తోంది. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఊట నీటితో నిత్యం పంట పొలాలు ముంపులోనే ఉంటుండగా... మరోవైపు దిగువ ప్రాంతంలో ఉన్న భూములు వరదల సమయంలో కోతకు గురవుతున్నాయి. ఏటా వరదలకు నది ఒడ్డున ఎడమవైపు ఉన్న ఎకరాల కొద్దీ పంట పొలాలు కనుమరుగై అన్నదాతకు గుండెకోత మిగులుతోంది. ఉన్న భూమి కళ్లెదుటే నదిలో కలిసిపోయి నష్టపోతున్న రైతుల వేదన వర్ణనాతీతం. ముఖ్యంగా బ్యారేజీ దిగువలో ఉన్న గొట్ట, గొడియాపడు గ్రామాల రైతుల భూములు చాలావరకు ఇప్పటికే వరదల సమయంలో కోతకు గురై నదీ గర్భంలో (మిగతా 6వ పేజీలో..)

ఒకటిన్నర ఎకరా పోయింది



గొట్టాబ్యారేజీ దిగువన నాకు రెండెకరాల సాగుభూమి ఉండేది. ఏటా వచ్చిన వరదలకు ఒకటిన్నర ఎకరాలకు పైగా పంటభూమి కోతకు గురైంది. ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదు. ఇప్పటికైనా స్పందించి ఆదుకోవాలి.

- చాపల రామారావు, గొట్ట గ్రామం

తీవ్రంగా నష్టపోయాం



గొట్టాబ్యారేజీ దిగువన కరకట్టలు నిర్మాణం చేపట్టకపోవడంతో మా గ్రామానికి చెందిన 25 మంది రైతులు తీవ్రంగా నష్టపోయాం. నాకు నది పక్కన రెండు ఎకరాల పొలం ఉండేది. ఎకరాకు పైగా వంశధారకు వచ్చిన వరదల సమయంలో నదీ గర్భంలో కలసిపోయింది.

- ముచ్చి చిన్నబాబు, గొట్ట గ్రామం

కొలువుదీరిన దుర్గమ్మ

● శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణాలు, పల్లెల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకొని.. పూజలు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణలో అఖండ దీపారాధన



నరసన్నపేట: వివిధ అవతారాల్లో దర్శనమిస్తున్న దుర్గమ్మ



పలాస: లేబర్ కాలనీలో భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ, దేవతామూర్తులు



ఎచ్చెర్ల: కుంచాల కురమయ్యపేట దేవీ ఆశ్రమంలో శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

కుంచాల కురమయ్య పేటలో..

ఎచ్చెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజరాజేశ్వరి దేవీని ప్రత్యేకంగా అలంకరించి శ్రీచక్రాల వద్ద మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు.



సోంపేట: ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన విగ్రహాలు



శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో తుల్జాభవానీ అమ్మవారు



పాతపట్నం: నీలమణిదుర్గను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



వజ్రపుకొత్తూరు: డోకులపాడులో కొలువ తీరిన అమ్మవారు



గార: దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



పైడిభీమవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



టెక్కలి: దుర్గాదేవి పూజల్లో భవానీ భక్తుల సందడి

నా బిడ్డను బతికించండి

● కేజీబీవీ విద్యార్థిని తల్లి వేడుకోలు

పొందూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తన బిడ్డకు బతికించాలని ఓ తల్లి వేడుకుంటోంది. ప్రభుత్వం స్పందించి మెరుగైన చికిత్స అందించాలని కోరుతోంది. ఆ తల్లి వేదన, కుమార్తె పరిస్థితిని చూసిన వారు కంటతడి పెట్టుకుంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పొందూరు మండలం లోలుగు కాలనీకి చెందిన సీహెచ్ లక్ష్మి కూలి పని చేసుకుంటోంది. కొన్నేళ్ల క్రితం భర్త క్యాన్సర్‌తో మృతి చెందడంతో ఇద్దరు పిల్లల భారం ఆమెపైన పడింది. ఎవరి అండాలేని లక్ష్మి కూలిపనికి వెళితేనే కుటుంబం గడుస్తుంది. తన కుమార్తె వందనను లోలుగు కేజీబీవీలో 6వ తరగతిలో చేర్పించింది. ప్రస్తుతం వందన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువులో ప్రతిభచూపే వందన.. ఏం జరిగిందో ఏమోగానీ నాలుగురోజుల క్రితం కేజీబీవీ పాఠశాల రెండో అంతస్తు నుంచి కింద పడింది. దీంతో ఆ బాలిక రెండు కాళ్లు, ఎముకలు విరిగిపోయాయి. వెన్నెముకకు కూడా తీవ్రగాయమైంది. ప్రస్తుతం ఆ బాలిక శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుప త్రిలో చికిత్స పొందుతోంది. కూలికి వెళితేగానీ కుటుంబం గడవని పరిస్థితు ల్లో ఉన్న ఆమె.. ఇప్పుడు ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతోంది. రక్తం, మందులు తేవడానికి ఎవరూలేక లక్ష్మి విలవిల్లాడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే రవికుమార్ తన కుమార్తెకు తక్షణం మెరుగైన వైద్యం అందించి ప్రాణభిక్ష పెట్టాలని కోరుతోంది.



బెడ్‌పై అచేతనంగా ఉన్న కుమార్తెకు సేవలు చేస్తున్న లక్ష్మి

అమ్మో.. అమెరికాలో ఉద్యోగమా?

(ఐదో పేజీ తరువాయి)

చేస్తున్నారు. కాగా కొత్తగా హెచ్1బీ వీసా అనుమతికి, రెన్యువల్‌కు ఏటా సుమారు రూ.90లక్షలు చెల్లించాలని కంపెనీలకు నిబంధన విధించడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. అమ్మో అమెరికాలో ఉద్యోగమా? అని టెన్షన్ పడుతున్నారు. ట్రంప్ ప్రకటనపై అమెరికాలో ఉన్న మైక్రోసాఫ్ట్, అమేజాన్, గూగుల్, యాపిల్‌తోపాటు అనేక అంతర్జాతీయ ఐటీ కంపెనీలు కూడా షాక్‌కు గురయ్యాయి. ఇక అమెరికాలో ఉద్యోగం కలగానే మిగలనుందని జిల్లాకు చెందిన చాలామంది నిరుత్సాహ పడుతున్నారు.

భయపడుతూ ఉద్యోగాలు చేస్తున్నాం



అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చినప్పటి నుంచీ భయపడుతూ ఉద్యోగాలు చేస్తున్నాం. ఇప్పటికే ఇక్కడ ఉండి ఉద్యోగాలు చేస్తున్నవారికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. హెచ్1బీ వీసా వల్ల అమెరికాలో చదువు, ఉద్యోగం చేయాలనుకునే వారికి మాత్రం ఇబ్బందే.

- దుబ్బ బెనర్జీ, పెద్దపద్మాపురం, అమెరికా ఉద్యోగి

నిర్ణయం వెనక్కితీసుకోవాలి



మా కూమారుడు, కోడలు లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. గతంలో అమెరికాలో ఉండేవారు. అక్కడ ఇబ్బందులు తెలుసుకుని లండన్ వెళ్లిపోయారు. అమెరికాలో చదువుతోపాటు ఉద్యోగం చేయాలనుకునే వారికి ట్రంప్ నిర్ణయం పెద్ద షాక్. దాన్ని వెనక్కి తీసుకోవాలి.

- ఎన్ని సంజీవరావు, రిటైర్డు ఉపాధ్యాయుడు, పెద్దపద్మాపురం

నది మింగేస్తోంది

(ఐదో పేజీ తరువాయి)

కలిసిపోయాయి. నది పక్కన వందలాది ఎకరాలు సారవంతమైన జిరాయితీ భూములు ఉన్నాయి. ఏడాది పొడవునా వరితోపాటు మొక్కజొన్న, చెరుకు, అపరాల పంటలు పండుతుంటాయి. 40మందికి చెందిన 50 ఎకరాలకుపైగా భూమి కోతకు గురవడంతో చిన్న, సన్న కారు రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్య ఏటా తీవ్రమవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. పంటతో పాటు ఉన్న భూమి పెళ్లలు పెళ్లలుగా విరిగి నదిలో పడిపోతుండటంతో దుఃఖంలో మునిగిపోతున్నారు. ఈ భూములనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులు ముస్ముందు ఏంచేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు.

సర్వే చేసినప్పటికీ..

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో వంశధార నదిపై కరకట్టల నిర్మాణానికి భూమిని సేకరించేందుకు ప్రభుత్వం సర్వే చేసింది. 2015-16లో రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం రూ.528.50 లక్షలు మంజూరు చేసినప్పటికీ పనులకు నోచుకోలేదు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ఈ పనులను రద్దు చేసింది. అప్పటి నుంచి పొలాలు వరద నీటిలో కొట్టుకుపోతున్నా పట్టించుకునే నాథుడే లేడు.

కరకట్టలతోనే మేలు

గొట్టాబ్యారేజీ దిగువ ప్రాంతంలో ఎడమవైపు కోతకు గురవుతున్న పంట పొలాలను ఇటీవల బాధిత రైతులతో కలిసి హిరమండలం జడ్పీటీసీ పి.బుచ్చిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కరకట్టలు నిర్మించకపోవడంతో ఏటా వంశధార వరదలకు పంట భూములు కొట్టుకుపోతున్నాయన్నారు. పొలాలు కోల్పోయిన రైతులు కూలీలుగా మరుతున్నారన్నారు. భూమిని సేకరించి.. నష్టపరిహారం చెల్లించి కరకట్టల నిర్మాణం చేపడితే సమస్య పరిష్కారం అవుతుందని అభిప్రాయపడ్డారు. నష్టపోయిన రైతుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు జిల్లా అధికారులకు నివేదించి.. కూటమి ప్రభుత్వం ద్వారా రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తానన్నారు.

డాబాలవాని చెరువునూ వదల్లే

(ఐదో పేజీ తరువాయి)

పైభాగం అంతా ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. సుమారు 75 ఎకరాల మేరకు ఆక్రమణకు గురి కాగా.. ఆ భూమిలో ప్రస్తుతం కొందరు వరి, పత్తి పండిస్తున్నారు. కొంతమంది సరుగుడు, నీలగిరి మొక్కలు పెంచుతున్నారు. ఇంకొందరు పంట కళ్లాలుగా వినియోగిస్తున్నారు. గతంలో ఆయకట్టు భూమి అంతటికీ సాగునీరు అందేదని, ప్రస్తుతం ఆక్రమణల కారణంగా ఆ పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి డాబాలచెరువులో ఆక్రమణలను అరికట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. చెరువు ఆక్రమణలను పరిశీలిస్తామన్నారు. ఆక్రమణలు తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అసెంబ్లీలో సమస్యల ప్రస్తావన

శాసనసభ సమావేశాల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు సమస్యలు ప్రస్తావించారు. సోమవారం ఆయా నియోజకవర్గాల పరిధిలోని సమస్యలు వివరించారు. జిల్లాలో సమస్యలు పరిష్కరించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత మంత్రులను కోరారు.

కాలువల నిర్వహణకు నిధులు కేటాయించాలి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాలువల నిర్వహణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. వ్యవసాయరంగాన్ని వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. కాలువల నిర్వహణ గాలికివదిలేయడంతో శివారు భూములకు సాగు నీరందక రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే రమణమూర్తి శాసనసభ సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడంతో ప్రాజెక్టు పనుల్లో కదిలిక వచ్చి సాగునీరందుతోందని తెలిపారు. గతంలో నీరు-చెట్టు పథకం మాదిరిగా కాలువల నిర్వహణకు బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. మామిడి, టమాట, ఉల్లి రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జీడికి సెస్ రద్దు చేయాలి

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అరకు కాఫీ మాదిరీగానే పలాస జీడి పప్పును కూడా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో శిరీష మాట్లాడుతూ పలాస జీడికి రాష్ట్రంలో విధిస్తున్న మార్కెట్ సెస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రతి రైతుకు బస్తాకు రూ.150 వరకూ మిగులుతుందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం జీవో- 10 తీసుకువచ్చి సెస్ విధానాన్ని రద్దు చేసిందని, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని మళ్లీ పునరుద్ధరించిందని గుర్తుచేశారు. జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు వచ్చేలా వన్ ప్రొడక్ట్-వన్ డిస్ట్రిక్ట్ పేరుతో జీడి పప్పును చేర్పించడంపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. జీడి బోర్డు ఏర్పాటు చేయాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కేంద్ర మంత్రికి విన్నవించారని, ఇదే జరిగితే పలాస జీడికి మహర్దశ పట్టనుందని తెలిపారు. జీడి పిక్కలు మన దేశంలోనే కాకుండా ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతి అవుతున్నాయని, దేశంలో ఏ పోర్టులో లేని ప్రతిబంధ కాలు విశాఖ పోర్టులో వ్యాపారులు ఎదుర్కొం టున్నారని, దిగుమతి ఇ బ్బందులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే తీర్చాలని కో రారు. కొత్తరేషన్ కార్డుల వ్యవహారంలో ఉన్న లోపాలు సరిదిద్దాలని శిరీష అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కోరారు. వైసీపీ హయాంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వల్ల అర్హత ఉన్నవారు కూడా రేషన్‌కార్డులు పొందలేకపో యారన్నారు. ఇద్దరు అన్నదమ్ములు ఉన్న కుటుంబం లో కొత్త కార్డులు పొందడానికి స్పిట్ ఆప్షన్ ఉండా లని, ఇది లేకపోవడం వల్ల కార్డులు పొందలేకపో యారని మందసలో ఓ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్య ప్రస్తావించారు. కాగా పలాస జీడి పరి శ్రమల వ్యాపారులు, రైతులు ఎదుర్కొంటున్న కష్టన ష్టాలు అసెంబ్లీలో ప్రభుత్వానికి వివరించిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు పారిశ్రామికవాడ జీడి పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించండి

● ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2014-2019 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ గృహ సముదాయంపథకం కింద సుమారు ఐదు లక్షల పక్కా ఇళ్లను మంజూరు చేశారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ మాట్లాడుతూ.. ఆమదాలవలస నియోజకవర్గంలో జగ్గుశాస్త్రులపేట వద్ద 510, మరో చోట 436 టిడ్కో గృహాలు మంజూరు చేశారన్నారు. అప్పట్లోనే ఈ ఇళ్లన్నీ 80 శాతం పూర్తి చేశామన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం టిడ్కో హౌసింగ్ కాలనీలను పక్కన పెట్టడంతో పాటు లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం డీడీ రూపంలో నగదు కూడా కట్టించుకుందన్నారు. నేటికి కొన్నేళ్ల నుంచి ఆ ఇళ్లను అలానే నిరుప యోగంగా ఉంచడం వల్ల లబ్ధిదారులు సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. సంబంధిత మంత్రి స్పందించి 80 శాతం పూర్తి చేసుకున్న గేటెడ్ కమ్యూనిటీ తరహా ఎన్‌టీఆర్ గృహ సముదా యాలను మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయించి లబ్ధిదిరులకు న్యాయం చేయాలని కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

నేను అవినీతికి పాల్పడలేదు

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, సెప్టెంబరు 22(ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గ పరిధిలో క్వారీ ల నిర్వహణలో తాను అవినీతికి పాల్పడుతున్నట్లు మీడియాలో తప్పుడు కథనాలు వస్తున్నాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశం జీరో అవర్‌లో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. క్వారీల నిర్వహణలో తనకు సంబంధం లేని విషయాల్లో తన ప్రమేయం ఉన్నట్టు కథ నాలు ప్రచురిస్తున్నారన్నారు. దీనివెనుక పక్క నియోజక వర్గానికి చెందిన కూటమి ఎమ్మెల్యే కుట్ర దాగి ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో క్వారీలకు అనుమతిచ్చారని, స్థానికులు, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేసినా వినలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వ మే క్వారీ అనుమతులను నిలిపివేసి న విషయాన్ని గుర్తుచేశారు. అయితే అప్పట్లో క్వారీలు దక్కించుకున్న వైసీపీ నేతలకు అధికార పార్టీ ఎమ్మెల్యే కొమ్ముకాసి తనపై బురదజల్లేలా వ్యతిరేక మీడియాలో కథనాలు రాయి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్వారీల నిర్వహణ, అడ్డుకోవడం వంటి వాటిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వినతుల పరిష్కారంలో నిరక్ష్యం వద్దు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 85 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. పరిశుభ్రత విషయంలో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిశీలన జరుగుతోందని, ప్రతి స్థాయిలో మూడు ప్రదేశాలను ఎంపిక చేసి అక్టోబరు 2న స్వచ్ఛత అవార్డులను అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

23 నెలలుగా జీతాలివ్వకుండా ఏం చేస్తున్నారు?

● డీఎంహెచ్‌వోను ప్రశ్నించిన కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎఫ్ఎన్‌వోలుగా 2023లో విధుల్లో చేరినా నేటికీ 23 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీఎంహెచ్‌వో డా.అనిత పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఎఫ్ఎన్‌వోలు జీతాలు చెల్లించాలని కోరుతూ గ్రీవెన్స్‌లో వినతి పత్రం సోమవారం అందజేశారు. తాము కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ నేపథ్యంలో కలెక్టర్.. డీఎంహెచ్‌వోను పిలిచి 23 నెలలుగా జీతాలు లేకుండా వారు బాధ పడుతుంటే మీరేం చేస్తున్నారు? ఇలా బాధ్యత లేకుండా ఎలా ప్రవరిస్తారు. తక్షణం తగు చర్యలు తీసు కోండి.. లేకుంటే మీ జీతాలు ఆపేస్తామంటూ స్పష్టం చేశారు. మీ పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మా ఇళ్లను కూల్చి.. రోడ్డున పడేయొద్దు

● సాయి శ్రీనివాసనగర్ లేఅవుట్ వాసుల ఆవేదన

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డీటీసీపీ అప్రూవల్‌తో నిబంధనలు పాటిస్తూ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించుకున్నామని అయితే నగరపాలక సంస్థ అధికారులు లేఅవుట్ మధ్య నుంచి 150 అడుగుల రోడ్డును ప్రతిపాదించారని, దీంతో ఇళ్లను కోల్పోవాల్సి వస్తోందని కలెక్టరేట్ రోడ్డులో సాయి శ్రీనివాసనగర్ లేఅవుట్ వాసులు వాపోయారు. నగరపాలక సంస్థ అధికారులు జారీ చేసిన అనుమతులను పరిగణనలోకి తీసుకోకుండా చర్యలు తీసుకోవడం వల్ల 100 కుటుంబాల జీవితాంతం కష్టపడి, అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లను కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. న్యాయం చేయాలని జేసీకి వినతి పత్రం అందించారు.

● రాష్ట్రప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ప్రైవేటు బస్సుల యజమానులు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆ సంఘం నేతలు అన్నారు. ఈ పథకంలో మమ్మల్ని చేర్చి ఆదుకోవాని కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఆర్టీసీ బస్సుల మాదిరిగానే 60ప్రైవేటు బస్సులు తిరుగుతున్నాయని, మహిళలకు ప్రైవేటు బస్సుల్లో ప్రయాణించే సదుపాయం కల్పించాలని కోరారు.

ఆక్రమణల జోరు.. పట్టించుకోరు

(ఐదో పేజీ తరువాయి)

ఇంతవరకూ అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదు. అలాగే టెక్కలిపట్నం గ్రామంలో దేవదాయశాఖ భూములను కూడా అక్రమార్కులు ఆక్రమించేశారు. దేవదాయశాఖకు చెందిన స్థలంలో షెడ్లు వేసి.. షాపులు నిర్మించి విక్రయించేందుకు యత్నించారు. దీనిపై ఇటీవల పత్రికల్లో కథనాలు రావడంతో దేవదాయశాఖ అధికారులు హుటాహుటిన ఆ షాపును బంద్ చేయించారు. కానీ ఆ షాపును పూర్తిస్థాయిలో తొలగించకపోవడం గమనార్హం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవదాయ, సంస్థానాధీశుల భూముల్లో ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా.. దేవదాయశాఖ భూములను లీజుకు ఇచ్చే అంశంపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలో అక్కడ షెడ్‌లను ఖాళీ చేయిస్తామన్నారు.

కాంప్లెక్స్ కిటకిట



మా బస్సు ఎప్పుడొస్తుందో ఏమో!



అదిగో బస్సొస్తోంది.. పరిగెత్తు.. పరిగెత్తు..

అరసవల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సులు 97శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. ఇప్పుడు ఆ రద్దీకి దసరా సెలవులు తోడయ్యాయి. దీంతో సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది. బస్సుల కోసం వేచిచూడడం.. రాగానే సీటు కోసం పరుగులు పెట్టడం కనిపించింది. వర్షం కురుస్తుండడంతో తడుస్తూ ఇబ్బందులు పడ్డారు.



త్వరగా ఎక్కు.. లేకుంటే సీటు దొరకదు



కర్చీఫ్ వేద్దామంటే ఈ దోరు రానేరాదు

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎస్పీ


వినతులను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి పలు ప్రాంతాల నుంచి వచ్చిన 63 మంది నుంచి వినతులు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మోస పూరితమైన, ఆస్తి తగాదాలు, కొట్లాటలపై ఫిర్యాదులు స్వీకరించారు.

విత్తన బంతుల తయారీలో రికార్డు


ధ్రువపత్రాన్ని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం కల్చరల్/పాత శ్రీకాకుళం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు 1.92 లక్షల విత్తన బంతులను తయారు చేసి వరల్డ్ రికార్డు సాధించారు. సెయింట్ జోసెఫ్ అన్నెసీ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 18న విత్తన బంతుల తయారీని చేపట్టారు. ఈనేపథ్యంలో వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించి రికార్డును ధ్రువీకరించారని ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కరస్పాండెంట్ జోసెఫిన్ మేరీ, స్వర్ణ జేవియర్ తెలిపారు. ఈ ధ్రువపత్రాన్ని సోమవారం ప్రదర్శించారు. 1,400 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఒక్కో విద్యార్థి సగటున 137.63 విత్తన బంతులు తయారు చేశారన్నారు. అనంతరం ప్రొవిన్షియల్ అవార్డు సర్టిఫికెట్లు షరీపా హనీఫా అందజేశారు. విద్యార్థులు తయారుచేసిన విత్తన బంతులను జిల్లా అటవీ శాఖ అధికారులకు అందజేశారు.

బోధనా రుసుం చెల్లింపులో జాప్యం తగదు

● వర్సిటీ ఎదుట ప్రైవేటు డిగ్రీ యాజమాన్యాల ఆందోళన


ఆందోళన చేస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధనా రుసుం చెల్లించడంలో జాప్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రైవేటు డిగ్రీ కళాశాలలు బంద్ పాటించి డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నాన జయరాం మాట్లాడుతూ.. బోధనా రుసుం వెంటనే చెల్లించి కళాశాలలు సజావుగా నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు 7 క్వార్టర్లకు సంబంధించి బకాయిలున్నారన్నారు. దీంతో కళాశాలల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. సంఘం ప్రతినిధులు కోట మురళి, దానేటి పద్మజ, బింగు చిట్టిబాబు, ఎం.మోహనరావు, టి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపన్నాయుడుపేట జంక్షన్ వద్ద తప్పిపోయిన ఆరేళ్ల బాలుడిని కుటుంబ సభ్యులకు సోమవారం శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని సీపన్నాయుడుపేట జంక్షన్ వద్ద ఆరేళ్ల ముద్దాడ ఉదయ్ ఏడుస్తూ స్థానికులకు తారసపడ్డాడు. అయితే ఉదయ్ తన కుటుంబ సభ్యులు ఎవర న్నది చెప్పలేకపోవడంతో స్థానికులు 112కు సమాచారం అందించారు. పోలీసులు బాలుడు ఉన్న ప్రదేశానికి వెళ్లి శ్రీకాకుళం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుమారుడు కనిపించడం లేదంటూ బాలుడు తండ్రి ప్రసాద్ రెండో పట్టణ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేందుకు రాగా అక్కడ తన కుమారుడు కనిపించడంతో పోలీసులు విచారించి సదరు చిన్నారిని తండ్రికి అప్పగించారు.

సృజనాత్మక ఆవిష్కరణలపై దృష్టిసారించాలి: ఎంపీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

ఎచ్చెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యా ర్థులు సృజనాత్మకత ఆవిష్కరణలపై దృష్టి సారించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. ఆర్జీయూకేటీ శ్రీకా కుళం క్యాంపస్‌లో సోమవారం 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కొత్తగా ఆలోచించడం, సాంకేతిక అంశాలను ఆకళింపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.శివరామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీలు బీమా చేయించుకోవాలి


కొబ్బరి తోటను పరిశీలిస్తున్న దృశ్యం

కవిటి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి రైతులు, రైతు కూలీలు బీమా చేయించుకోవాలని రాష్ట్ర కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ రెడ్డి అన్నారు. కవిటిలోని కొబ్బరి తోటలను చికాఫ్ ప్రతినిధులతో కలిసి సోమవారం పరిశీలించారు. రూ.140 చెల్లిస్తే ప్రమాదం జరిగితే ఆసుపత్రి బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే మృత్యువాత పడితే రూ.7 లక్షలు బీమా అందుతుందన్నారు. ఉద్దానం కొబ్బరి రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ అందించాలని సంఘం ప్రతినిధులు కోరారు. దీనిపై ప్రభుత్వంలో చర్చిస్తున్నామని ఆమోదించిన వెంటనే వివరాలు తెలియజేస్తామని డీడీ తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక పామ్ డైరెక్టర్ ధనశేఖర్, చికాఫ్ అధ్యక్షుడు జోహార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోంపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎకువూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్' శీర్షికతో కథనం రాగా ట్రాన్స్‌కో ఏఈ రామారావు స్పందించారు. తక్షణం సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఇన్‌చార్జి లైన్‌మెన్ కుమారస్వామి, సిరిమామిడి లైన్‌మేన్ రమణ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు తొలగించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు.


మొక్కలు తొలగించిన దృశ్యం

అంధురాలిపై కనికరం లేదా?

● ఇల్లు ఆక్రమణకు యత్నం
● ఆమెకు అండగా ఉన్న వారిపై దౌర్జన్యం


ఇంటి వద్ద దీనంగా ఉన్న వృద్ధురాలు

పొందూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆమె వృద్ధురాలు.. పైగా అంధురాలు.. ఆపై యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే ఇవేవీ వారికి పట్టడం లేదు. ఆమెకు చెందిన ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.. ఇదేమి దౌర్జన్యం అని అడిగే వారిపై సామాజికవర్గం పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో ఆ వృద్ధురాలు సొంత ఇంటిలోనూ కంటి మీద కునుకు లేకుండా ఆవేదన చెందుతోంది. ఇదీ మండల కేంద్రంలోని వాండ్రంగి వీధిలో నివసిస్తున్న కుమరాపు తవిటమ్మ పరిస్థితి.. వివరాలిలా ఉన్నాయి.. భర్త ఎర్రయ్యను కోల్పోయిన కుమరాపు తవిటమ్మ యాచక వృత్తి చేసుకుంటూ ఆ వచ్చిన మొత్తంతో 1999లో రూ.5 వేలు పెట్టి వాండ్రంగివీధిలో అదపాక తవుడు వద్ద స్థలం కొనుగోలు చేసింది. ఆ స్థలాన్ని తవుడు 1996లో జి.సిగడాం మండలానికి చెందిన దన్నాన రాములమ్మ వద్ద కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నాయి. తాను కొనుగోలు చేసిన స్థలంలో చిన్న పూరింటిని నిర్మించుకుని రాములమ్మ యాచకం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఒంటరిగా ఉండడం, అంధురాలు కావడంతో ఆమె ఇంటిపై ఓ మహిళ కన్నేసింది. ఇటీవల ఆ ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మించడంతో ఇల్లు దిగువకు పోవడంతో ఇంటి నిర్మాణం చేపట్టాలని భావించింది. ఇప్పటికే ఏమాత్రం వర్షం కురిసినా ఇంటిలోకి నీరు చేరి వృద్ధురాలు తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. యాచనతో వచ్చిన నగదును వీధిలోని మరో వ్యక్తి వద్ద భద్రపరిచింది. ఆ డబ్బుతో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించుకుంది. పనులను ప్రారంభించగా ఇంటిని ఆక్రమించుకోవాలని భావించిన మహిళ కొందరిని తీసుకు వచ్చి పనివారిని బెదిరించింది. ఈ నేపథ్యంలో స్థానికులు వచ్చి ఆమెను నిలదీస్తే తన సామాజికవర్గం పేరును వినియోగించుకుని బెదిరింపులకు పాల్పడింది. ఆ స్థలం తమదని ఆక్రమణదారు చెప్పడంతో డాక్యుమెంట్లు తేవాలని కోరినా కుల దూషణ పేరుతో బెదిరించడంతో వారు భయపడి పనులు నిలిపివేశారు. దీంతో నిత్యం ఇంటిలో ఉండలేక ఆమె తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని వృద్ధురాలికి అండగా నిలిచి ఇంటి నిర్మాణం చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం

జి.సిగడాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాడ గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు రెడ్‌క్రాస్ సామగ్రిని పంపిణీ చేసింది. ఈ మేరకు సోమవారం రాజా రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్ తదితరులు అగ్నిప్రమాద బాధితులు చల్లా ఆదినారాయణ, చల్లా అప్పయ్యమ్మ, పులప నర్సింహులు కుటుంబాలకు రూ.5 వేలు విలువ చేసే దుస్తులు, వంటపాత్రలు, టార్పాలిన్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్, తహసీల్దార్ ఎం.సరిత, ఆర్ఐ ఎ.రాధ, సర్పంచ్ గోవ మహేష్, ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై శ్వేతపత్రాన్ని ప్రకటించాలి

గుజరాతీపేట. సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు అప్పుతో నడుస్తున్న సాల్ట్ పథకం ద్వారా రాష్ట్రంలో చేపడుతున్న విద్యా రంగ సంస్కరణల వల్ల లాభనష్టాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తెలుగు నేల పోరాడి సాధించుకున్న మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రంలో తెలుగు మీడియం లేకుండా ఇంగ్లీషు మీడియం ద్వారా నాణ్యమైన విద్య వస్తుందని పాలకులు నమ్మబలకడం, ఆచరణలో విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ వేదికగా జరిగిన కిక్‌బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన పలువురు క్రీడాకారులను సోమవారం అభినందించారు. స్థానిక ఏడురోడ్ల కూడలిలోని ఓ కల్యాణ మండపంలో వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన వేణుగోపాల్, లయన్స్‌క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్, శిక్షకులు హేమంత్ కుమార్, హరీష్, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనిగంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కంచిలి/ఎచ్చెర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీలు, షాపుల్లో కార్మికుల పనిగంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కంచిలి, ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎస్.లక్ష్మీనారాయణ, అగ్రికెమ్ కార్మికుల యూనియన్ నాయకులు సత్యనారాయణ, టి.రవికుమార్ పాల్గొన్నారు.

బుడుమూరు సంతలో వాటర్ ట్యాంకు

లావేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బుడుమూరు సంత సెంటర్‌లో వాటర్ ట్యాంక్‌ను సోమవారం బెండు సత్తిబాబు న్యూ యూత్ కమిటీ సభ్యులు ప్రారంభించారు. వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

విధ్వంసకర అభివృద్ధి వద్దు

● మానవహక్కుల సంఘం సమన్వయకర్త వీఎస్ కృష్ణ


బహిరంగ సభలో మాట్లాడుతున్న వీఎస్ కృష్ణ

సరుబుజ్జిలి/బూర్జ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస నియోజకవర్గం బూర్జ, సరుబుజ్జిలి మండలా సరిహద్దు ప్రాంతంలో అభివృద్ధి పేరుతో ఏర్పాటు చేయనున్న విధ్వంసకర థర్మల్ పవర్ ప్లాంట్ వద్దని మానవ హక్కుల సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వీఎస్ కృష్ణ అన్నారు. సోమవారం అడ్డూరిపేటలో థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక బహిరంగ సభ నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మితో కలిసి మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు పర్యావరణానికి విఘాతం కలిగించే థర్మల్ పవర్‌ప్లాంట్‌ను నిలుపుదల చేసేందుకు ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. ప్రమాదకర పవర్ ప్లాంట్ ప్రతిపాదన ఆపకపోతే ప్రజలు, రైతులతో కలిసి పోరాటాలు చేస్తామన్నారు. ఇదిలావుండగా బహిరంగ సభ నిర్వహణకు అనుమతులపై అనుమానాలు రేకెత్తాయి. అడ్డూరిపేటలో సభకు అనుమతులు లేవని పేర్కొంటూ పోలీసులు సభను నిలువరించడం జరుగుతుందని ప్రచారం జరిగింది. రాజకీయ పార్టీలు లేకుండా ఆదివాసీలు, రైతులు సభ నిర్వహించుకునేందుకు షరతులతో కూడిన అనుమతులను పోలీసులు మంజూరు చేసినట్లు తెలిసింది. డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ, సరుబుజ్జిలి, బూర్జ ఎస్ఐలు హైమావతి, ప్రవల్లిక, బాలరాజు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సురేష్‌దొర, సింహాచలం, రవికాంత్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, వామపక్ష నేతలు తాండ్ర ప్రకాష్, తామర సన్యాసి రావు, దానేష్, మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ హాల్‌లో ప్లకార్డులతో నిరసన

● ఇది సరికాదంటూ వైసీపీ నేతలపై కలెక్టర్ ఆగ్రహం


గ్రీవెన్స్‌లోకి ప్లకార్డులతో వెళ్లిన వైసీపీ నాయకులు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ హాల్‌లోకి వైసీపీ నేతలు ప్లకార్డులతో రావడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పొందూరు మండలంలో ఎరువుల పంపిణీలో రైతులకు ఎదురవుతున్న సమస్యలపై ఆ మండలానికి చెందిన వైసీపీ నేతలు వినతి పత్రం ఇచ్చేందుకు సోమవారం వచ్చారు. నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో హాలులోకి వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్లకార్డులతో ఎలా వస్తారని, ఇది సరైన విధానం కాదని, నిరసన తెలపాలంటే బయట చేసుకోవాలని ఆగ్రహం చెందారు. దీంతో వైసీపీ నాయకులు బిత్తరపోయారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

యూరియా కోసం లారీని చుట్టుముటిన రైతులు


లారీ ముందు ఆందోళన చేస్తున్న రైతులు

పొందూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో అధికారుల తీరు పై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేటాయింపులు, వస్తున్న యూరియాలో పెద్ద ఎత్తున వ్యత్యాసాలుండడంతో వారు ఆవేదనకు గురవుతున్నారు. మలకాం (జాడపేట)కి ఇంత వరకు కేవలం 20 టన్నులు యూరియాను మాత్రమే కేటాయించారు. సోమవారం 15 టన్నులు కేటాయించినట్లు వ్యవసాయాధికారుల నుంచి గ్రామస్థులకు సమాచారం వచ్చింది. ఇప్పటికే యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు కేవలం 5 టన్నులతో లారీ రావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సర్పంచ్ జాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా రైతులు లారీని చుట్టుము ట్టారు. మా గ్రామానికి కేటాయించిన 15 టన్నులు రాకపోతే లారీని వదిలేది లేదని స్పష్టం చేశారు. దీనిపై ఏవో శ్రీనివాసరావును వారు ప్రశ్నించగా 15 టన్నులు కేటాయిం చడం వాస్తవమని, కాని 5 టన్నులు పంపినట్లు యూరియా కేటాయింపు అధికారుల నుంచి సమాచారం వచ్చిందన్నారు. మాకు కేటాయించిన యూరియాను జిల్లాకు చెందిన ఒక కీలక అధికార పార్టీ నాయకుడు తన నియోజకవర్గానికి తరలించికుపోయారని రైతులు ఆరోపించారు.

కంచిలి చేరిన రాహుల్ చౌదరి పాదయాత్ర


రాహుల్ చౌదరికి గ్రామస్థుల సంఘీభావం

కంచిలి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ చిహ్నంగా ప్రకటించాలని కోరుతూ రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లా జ్యోతిర్యాలీ గ్రామానికి చెందిన రాహుల్ చౌదరి చేపట్టిన పాదయాత్ర సోమవారం కంచిలికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఏడు రాష్ట్రాల్లో ఈ పాదయాత్ర చేస్తున్నానన్నారు. ఇప్పటి వరకు 9500 కిలో మీటర్లు పూర్తి చేశానన్నారు. కంచిలి జాతీయ రహదారి వద్ద ఆయ నకు గ్రామస్థులు జగదీష్ పట్నాయక్, ఇప్పిలి ప్రవీణ్‌కుమార్, పూనా శ్రీకాంత్, కొత్తకోట విజయ్‌బాబు, కొంచాడ కామేష్ కలిసి ఆర్థిక సాయం అందించారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

థర్మల్ కేసులు ఎత్తివేయాలి


హోంమంత్రి అనితకి వినతి పత్రం అందిస్తున్న కృష్ణమూర్తి

సోంపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): థర్మల్ పోరాటంలో భాగంగా స్థానిక ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని పీపీఎస్ అధ్యక్షుడు వైకృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి అమరావతిలో హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి వినతి పత్రం అం దించారు. ఆనాటి కేసులతో ఇప్పటికీ కొందరు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నత చదువులు, ఉద్యోగాలు, విదేశాల పర్యటనకు ఇక్కట్లకు గురవుతున్నారని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. కేసులు ఎత్తివేయాలని కోరారు.

వైసీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులు

ఆమదాలవలస, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ నాయకులు పెట్టుకున్నారని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. థర్మల్ పవర్ ప్లాంట్‌పై తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ నాయకుడు చింతాడ రవికుమార్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ నేతలు నూకరాజు, బోర గోవిందరావు, బోయిన సునీత, సంపతిరావు మురళి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మకరతోరణం సమర్పణ

కవిటి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గొండ్యాలపుట్టుగ శ్రీభూలోక మాతకి దాతల సహకారంతో తయారు చేయించిన మకరతోరణాన్ని సోమవారం అలంకరించారు. పి.రామారావు, గెడ్డమ్మ, డి.లోకనాథం, బి.చలపతి, కె.బాబూరావు తయారుచేయించారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

ఎచ్చెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని వేంకటేశ్వర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈ వీ నాగోజీ, పీజేబ్లడ్ బ్యాంకు చైర్మన్ డాక్టర్ పీజే నాయుడు అన్నారు. ఈనెల 25న జాతీయ ఫార్మసీ దినోత్సవం సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ తారకరామారావు, భానోజీరావు పాల్గొన్నారు.

సిబ్బంది లేరు.. సబ్‌స్టేషన్ లేదు

● సాంకేతిక సమస్యలతో తరచూ గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం
● ఇదీ శ్రీకూర్మంలో విద్యుత్ సమస్య పరిస్థితి

గార రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం పంచాయతీలో విద్యుత్ వ్యవస్థలో సమస్యలు నెలకొన్నాయి. ప్రధానంగా సిబ్బంది కొరత, లోవోల్టేజీ వల్ల వినియోగదారులు అవస్థలకు గురవుతున్నారు. ఇక్కడ సబ్‌స్టేషన్ కూడా లేదు. దీంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

ఇదీ పరిస్థితి

గార మండలంలోని శ్రీకూర్మం మేజర్ పంచాయతీ పరిధిలో 32 గ్రామాలు ఉన్నాయి. సుమారుగా 6000 ఇళ్లు, 13000 మంది ఓటర్లు ఉన్నారు. తీరప్రాంత గ్రామాలతోపాటు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మనాథుని ఉంది. ఇక్కడ వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు పెద్దమొత్తంలో జరుగుతుంటాయి. ఇంతటి ప్రాధాత్యం ఉన్న శ్రీకూర్మంలో గ్రామస్థులు నిత్యం విద్యుత్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ పరిధిలో పాలనాపరమైన కార్యకలాపాలు నిర్వహించేందుకు శ్రీకూర్మం, ఎస్.మత్స్యలేశం, దువ్వపేట, తండ్యాలపేట గ్రామసచివాలయాలు ఏర్పాటుచేశారు. 32గ్రామాల్లో ఆరువేలకుపైగా డొమస్టిక్ సర్వీసులు, 60 పరిశ్రమల సర్వీసులు, 280 విద్యుత్ మోటారు కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ బిల్లుల చెల్లింపు పరంగా మండలంలోనే విద్యుత్ సంస్థకు శ్రీకూర్మం నుంచి ఎక్కువ ఆదాయంవస్తోంది. అయితే పంచాయతీకి 24 గంటల విద్యుత్ సదుపాయంకోసం సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా ఇక్కడ సిబ్బంది కొరత వేధిస్తోంది. నాలుగు సచివాలయా లకు సంబంధించి లైన్‌ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌తో పాటు ఒక్కో సచివాలయం పరిధిలో ఇద్దరేసి జూనియర్ లైన్‌మెన్లు నిబంధనల ప్రకారం మొత్తంగా 11 సిబ్బంది అవసరం. అయితే కేవలం నలుగురు సిబ్బంది మాత్రమే విధులు నిర్వస్తున్నారు. దీంతో ఒకోసారి ఫ్యూజ్‌పోయినా శ్రీకూర్మం పంచాయతీ పరిధిలో మొత్తం గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

రొయ్యల చెరువులు.. రైస్ మిల్లులు


శ్రీకూర్మంలోని ట్రాన్స్‌ఫార్మర్

గ్రామానికి వెనుక భాగంలో ఉన్న రొయ్యల చెరువులు, గ్రామానికి చుట్టు ఉన్న రైస్ మిల్లులకు 24 గంటల విద్యుత్ సరఫరా లైన్ ఉంది. గ్రామానికి 24 గంటల విద్యుత్ లైన్ ఏర్పాటుకు సుమారుగా 90 కిలో మీటర్ల దూరం నుంచి లైన్ వేసుకొని రావాలని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన విద్యుత్ తీగల వల్ల నిత్యం ఫ్యూజ్‌లు పోవడం, తీగలు తెగిపోవడం వంటి సాంకేతికమైన సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ సమస్యలు వర్షాకాలంలో మరి ఎక్కువగా ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, గాలివీచినా విద్యుత్ సరఫరాకు అంతరాయం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే కొందరు చోరీలకు తెగబడుతున్నారని, ఇటీవల గ్రామంలో ఉన్న ఓ బ్యాంకులో మేనేజర్ గది గోడకు రంధ్రం చేసి చోరీకి ప్రయత్నించగా చుట్టు పక్కల వారు కేకలు వేయడంతో దుండగలు పరారయ్యారని గ్రామస్థులు తెలిపారు.

వేలాపాలా లేకుండా అంతరాయం



తరచూ విద్యుత్‌సమస్యలతో ఎక్కువగా వ్యాపారస్తులం ఇబ్బంది పడుతున్నాం. వేళాపాలా లేకుండ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది.రాత్రివేళల్లో విద్యుత్ నిలిచిపోతే తీవ్ర భయాందోళనకు గురవుతున్నాం.

-ఎ.చందు, బంగారం వ్యాపారి

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం



ట్రాన్స్‌పార్మర్లు అవసరం మేరకు లేకపోవడంతో లోవోల్టేజీ ఇబ్బంది ఎక్కువగా ఉంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారంకాలేదు.ఎమ్మెల్యే శంకర్,మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికితీసుకెళ్లాం. సానుకూలంగా స్పందించారు. త్వరలో పరిష్కారం అవుతుంది.

-వీఎస్ గిరి, టీడీపీ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు

హడావుడి చేసి స్థల పరిశీలనచేశారు



వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి హడాహుడిగా స్థల పరిశీలనచేసి ఓట్లు వేయించుకున్నారు. ఉపకేంద్రం ఏర్పాటు జరగలేదు. ఉపకేంద్రం ఏర్పాటుచేస్తే తప్పా విద్యుత్ సమస్యలు పరిష్కారం కావు..

- సీహెచ్ కూర్మారావు, గాజుల వ్యాపారి

ఒడిశా టు తమిళనాడు

● 15 కేజీల గంజాయితో వ్యక్తి అరెస్ట్ ● సీఐ మీసాల చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కొనుగోలు చేసిన 15 కేజీలగంజాయిని తమిళనాడులోని విల్లుపురంజిల్లాకు తరలిస్తున్న అదే జిల్లాకు చెందిన అజయ్‌ని పట్టుకొని అరెస్ట్ చేశామని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్ఐ రవివర్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. విల్లుపురం జిల్లా ఆర్‌సీ మిలకొండై‌గ్రామానికి చెందిన అజయ్‌కిఅదే గ్రామంలో గ్రౌండ్‌లోఆడుకొనే సమయంలో గంజాయి వ్యాపారం చేసే విగ్నేశ్వర్ (అలియాస్ విక్కీ)తో పరిచయం ఏర్పడింది. డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నానని విక్కీతో చెప్పాడు. నేను చెప్పిన పనిచేస్తే నీకు డబ్బులు ఇస్తానని విక్కీ చెప్పడంతో అజయ్ ఒప్పుకున్నాడు.ఈనేపథ్యంలో ఒడిశాలోని మోహన్ ప్రాంతానికిచెందిన దౌడ్ ధీర్ (అలియాస్ ధీరజ్) వద్ద నుంచి గంజాయిని తీసుకొస్తే తాగడానికి గంజాయితో పాటు ఖర్చులు, అదనంగా రూ.5 వేలుఇస్తానని చెప్పాడు.దీంతో అజయ్, విక్కీ ఒడిశా నుంచి రైలులో బయలు దేరి బరంపురం చేరుకున్నారు. బరంపురంలో పోలీస్ తనిఖీ ఎక్కువగాఉండడంతో బస్సులో ఇచ్ఛాపురం వచ్చారు. బస్టాండ్ నుంచి తమిళనాడు వెళ్లేందుకు ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు ఇద్దరు చేరుకున్నారు.విక్కీ రైలుటికెట్ తీసేందుకు వెళ్లగా అజయ్‌గంజాయి బ్యాగ్‌తో ప్లాట్ ఫారంపై కూర్చొనిఉన్నాడు.అతడు అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టణ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ రవివర్మ బ్యాగ్‌ను తనిఖీచేశారు.అందులోగంజాయి ఉన్నట్టు గుర్తించి సీజ్‌చేశారు.నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

చికిత్సపొందుతూ విద్యార్థిని మృతి

నందిగాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొండ్రాయివలసకు చెందిన విద్యార్థిని సీపాన శ్రీనిధి(10) చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందింది.గ్రామస్థుల కథనం మేరకు... శ్రీనిధి ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము కాటువేసింది.అర్థరాత్రి కాటువేయడంతో తెలుసుకోలేకపోయింది.వేకువజామున మూడు గంటలు ప్రాంతంలో శ్రీనిధి అపస్మారకస్థితికి వెళ్లిపోవడంతో ద్విచక్రవాహనంపై టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో శ్రీనిధి ఐదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు పవిత్ర, శివ, సోదరి ఉన్నారు. శ్రీనిధి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

నిబంధనల మేరకు ఖర్చు చేయండి

నరసన్నపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వివిధ పనుల నిర్వహణకు నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేయకుండా నిబంధనల మేరకు ఖర్చు చేయాలని, నిధులపై నియంత్రణ లేకుండా పోతోందని వార్డు సభ్యులు కోరాడ చంద్రభూషణగుప్త, రఘుపాత్రుని శ్రీధర్ తెలిపారు. సోమవారం నరసన్నపేట పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ నిధులు ఖర్చు చేయదలిస్తే టెండర్లు ఖరారు చేయాలన్నారు. బయోమెట్రిక్ యంత్రాలు కొనుగోలు చేసినా ఇంతవరకు వినియోగించకపోవడంపై ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు ప్రశ్నించారు. పీడబ్ల్యూఎస్ సిబ్బందికి ఆరు నెలల జీతాలు చెల్లించాలని సభ్యులు కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ బి.శంకరరావు, ఈవో ద్రాక్షాయిణి,సభ్యులు లోకనాథశర్మ, గొలివి రామారావు, నీలం పాల్గొన్నారు.

ప్రతి గిరిజనుడికి పక్కా ఇల్లు ఉండాలి: ఎంజీఆర్

పాతపట్నం రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి గిరిజనుడు పక్కా ఇల్లు ఉండాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడిగోవిందరావు తెలిపారు. సోమవారం పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెళియాపుట్టి మండలంలోని కేరాసింగి గూడ గ్రామానికి చెందిన ఎనిమిదిమంది లబ్ధిదారులకు గిరిజన సంఘ నాయకురాలు భైరసింగి ధరణి, మెళియాపుట్టి మాజీ ఎంపీపీ బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పట్టాలను పంపిణీ చేశారు. ఇళ్ల నిర్మాణానికి చోటు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతుండడంతో ధరణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు భూమి యజమని దేవిశ్రీప్రసాద్‌తో మాట్లాడారు.దీంతో సుమారు ఎకరా భూమి గిరిజనులకు దానం చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. దీంతో గిరిజనులకు పట్టాలను అందించారు.

ఆయుష్మాన్ సిబ్బంది అందుబాటులో ఉండాలి

పోలాకి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో సేవలు మరింత పెంచాలని నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ స్టాండర్డ్స్ బృందం సభ్యులు నిర్వాహకులకు సూచించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సోమవారం గాతలవలస ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ స్టాండర్డ్స్ పర్యవేక్షణ బృందసభ్యులు తనిఖీ చేశారు. ఏడు రకాల సేవల రికార్డులను పరిశీలించి ఆయుష్మాన్ కేంద్ర నిర్వాహకులకు పలు సూచనలుచేశారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి రవికుమార్, వైద్యాధికారి శ్రీనాథ్, విస్తరణాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి

శ్రీకాకుళం లీగల్ సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉత్తమ పౌరులను తయారుచేసిన వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తెలిపారు. శ్రీకాకుళంలోని ఇలిసిపురంలో గల ఖ్యాతి వృద్ధాశ్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వృద్ధులపై ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రావణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 80 మంది అథ్లెట్లు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఈనెల 27వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 80మంది అథ్లెట్లు ఎంపికయ్యారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మధుసూదనరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25న ఆమదాలవలస రైల్వేస్టేషన్ వద్దకు హాజరుకావాలని కోరారు. పదో తరగతి మార్క్ మెమో, ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు మూడు పాస్‌పోర్టు ఫోటోలతో హాజరు కావాలన్నారు.

బీఆర్ఏయూలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా వలంటీర్లకు ప్రతిభా పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, నృత్యం, గానం కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ, అధ్యాపకులు కె.ఉదయకిరణ్, పి.రవికుమార్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే ధ్యేయం

బూర్జ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):తల్లి,శిశు సంరక్షణలో వివిధ అంశాలపై అవగాహన కలిగించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే స్వస్త్ నారీ స్వసక్త్‌పరివార్ ధ్యేయమని నాబార్డ్ డీడీఎం నాగార్జున తెలిపారు. సోమవారం పెద్దపేటలో ఆర్డ్స్‌సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి ద్రోణగిరిరావు, ఆర్డ్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, సీతఈవో శంకరరావు, ఎస్ఐ ప్రవళిక, అనూప్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం

పాత శ్రీకాకుళం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారమేలక్ష్యంగా పోరాటంచేయాలని ఏపీపవర్ జేఏసీ నేతలు తెలిపారు. సోమవారం విద్యుత్ ఉద్యోగులు స్థానిక జీటీ రోడ్డులో సర్కిల్ కార్యాలయం నుంచి జడ్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ పవర్ జేసీ, జిల్లా జేఏసీ చైర్మన్ ఎంవీగోపాలరావు, కన్వీనర్ రమేష్, రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య, రాఘవరెడ్డి పాల్గొన్నారు.


శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

భక్తుల దర్శనానికి పక్కా ఏర్పాట్లు

● కొత్తమ్మతల్లి ఆలయ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్


క్యూలైన్ పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కోటబొమ్మాళి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా పక్కాఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం కోటబొమ్మాళిలో ఏర్పాటుచేసిన హెలికాప్టర్ రైడ్‌టికెట్లు కౌంటర్‌ను పరిశీలించారు.ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ జరిగేలా చర్యలుతీసుకోవాలని డీపీవోకు ఆదేశించారు. హెలికాప్టర్ రైడ్‌కు వచ్చే పర్యాటకులకు మౌలికసదుపాయాలు కల్పించాలని,హెలిపాడ్ వద్ద ఫైర్‌సేఫ్టీ, వైద్య శిబిరం ఏర్పాట్లుచేయాలని తెలిపారు. వాహనాల పార్కింగ్, తాగునీటి సదుపాయం, రాకపోకలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. క్యూలైన్లను పరిశీలించారు. పీఏసీఎస్‌మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ కలెక్టర్‌నుకలిశారు.కార్యక్రమంలో డుమాపీడీ సుధాకర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ, నెహ్రూయువకేంద్ర సహాయ సంచాలకుడు వెంకట్ ఉజ్వల్,డీపీవో భారతి సౌజన్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్, డీఎస్పీ లక్ష్మణరావు, రూరల్ సీఐ శ్రీనివాసరావు, కొత్తమ్మతల్లి ఆలయ ఈవో రాధాకృష్ణ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి

కొత్తూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం జీఎస్టీతగ్గింపు, మినహాయింపులతో పేద,బడుగు, బలహీన వర్గా లకు మేలు జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి తెలిపారు. సోమవారం కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపువల్ల పేదలు వినియోగించే నిత్యవసరసరుకులు ధరలుతగ్గుతాయని తెలిపారు.ప్రధానమంత్రి మోదీ తీసుకున్న నిర్ణయం దేశం ఆర్థికాభివృద్ధి వైపు పయనిస్తుందని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన తప్పనిసరి

కాశీబుగ్గ,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):వస్తుసేవల పన్ను(జీఎస్టీ) మంగళవారం నుంచి తగ్గించనుండడంతో వినియోగదారులకు అవగాహన తప్పనిసరి అని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్. వెంకటాచలం సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.మధ్య తరగతి వినియోగదారులు కొనుగోలు చేసే 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గించడం వినియోగదారులకు కొంత ఊరట లభించిందని తెలిపారు. అధికారుల పర్యవేక్షించి వినియోగదారులకు బాసటగా నిలవాలని కోరారు.

కార్మిక చట్ట సవరణ బిల్లు ఉపసంహరించాలి



కొత్తూరులో ధర్నా చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

కొత్తూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్ట సవరణ బిల్లు ఉపసంహరించాలని సీఐటీయూ నాయకుడు పనస రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తూరు నాలుగురోడ్ల జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు పది గంటలు పనిని రద్దు చేసి ఎనిమిది గంటలు పని విధానం అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో శిర్ల ప్రసాదరావు, హరికృష్ణ, ఆనందరావు, వెంకటరావు, సురేష్, రామారావులు పాల్గొన్నారు.

70 టీములతో గాలికుంటువ్యాధి నివారణ టీకాలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 70 టీములతో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని జిల్లా పశువైద్య సంయుక్త సంచాలకుడు బి.గోపాలరావు తెలిపారు. సోమవారం కోటబొమ్మాళి, కమలాభపురంలో సహాయ సంచాలకులు ఎం.లోకనాధం ఆధ్వర్యంలో జరుగుతున్న పశువైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,30,100 డోసులు లక్ష్యంగా కాగా ఇప్పటివరకు 12,851 డోసులు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, మెండ ప్రజ్ఞచైతన్య పాల్గొన్నారు.

దూడలకు టీకాలు వేయాలి

పాతపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):నాలుగునెలల దాటిన దూడలకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.కరుణాకరరావు తెలిపారు. స్థానికఉప్పరవీధిలో నిర్వహించిన గాలికుంటువ్యాధి నివారణటీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో సిబ్బంది ఒడిశికుమారి, నారాయణ పాల్గొన్నారు.

ఆర్‌టీఎఫ్ చెల్లించాలి

నరసన్నపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలలకు రీయింబర్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఆర్‌టీఎఫ్) చెల్లించాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, యాజమాన్యప్రతినిధులు కోరారు.ఈ మేరకు సోమవారం నరసన్నపేట పట్టణంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీహయాం నుంచి బకాయి ఉన్న ఫీజులను చెల్లించాలని, అధ్యాపకులు జీతాలు చెల్లించుకోలేక, కళాశాలలు నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు.

నరసన్నపేటలో విశ్వకర్మ నిమజ్జనం

నరసన్నపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో పంచవృత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంత్యుత్సవాలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా విశ్వకర్మ ఉత్సవమూర్తిని ఊరేగించి నిమజ్జనం చేపట్టారు. తొలుత ప్రత్యేక పూజలు, పూర్ణాహూతి చేపట్టారు.

55 మందికి దుస్తుల పంపిణీ

నరసన్నపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని పిల్లలకు ఎస్‌వీసీటీ, పడాల బారిటబుల్ ట్రస్టులు వారధి ప్రాజెక్టు ద్వారా అండగా నిలిచాయి. ఈ మేరకు సోమవారం నరసన్నపేటలో తల్లి, తండ్రి లేదా తల్లిదండ్రులు లేని ప్రభుత్వపాఠశాలల్లో చదివే 55 మంది విద్యార్థులకు దుస్తులను పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు, రిటైర్డు ప్రిన్సిపాల్ జ్యోతి పెద్రిక్, సదాశివుని కృష్ణ, టంకాల అర్జున పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

టెక్కలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, కృషి విద్యార్థులకు అవసరమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఐతమ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో డైరెక్టర్ నాగేశ్వరరావు,ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు,శాంతికుమార్, విష్ణుమూర్తి, రమణయ్య, రత్నమణి పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలి

నందిగాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రెండోవిడత స్వామిత్ర సర్వే వేగవంతం చేయాలని డివిజినల్ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖరరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులు, గ్రామ సర్వేయర్లతో సమీక్షించారు.ఈనెల28నాటికి నిర్దేశించిన ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, మండల సర్వేయర్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్‌ను పూర్తి చేయండి

పలాసరూరల్,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):నత్తనడక నడుస్తున్న ఆఫ్‌షోర్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని మాజీ మంత్రి గౌతు శివాజీ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోజరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నియోజకవర్గాల రైతులకు ఉపమోగపడే ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని కోరారు.హుద్‌హుద్ తుఫాన్ సమయంలో ప్రజలకు అందజేసేందుకు నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. తితలీతుఫాన్ సమయంలో హెరిటేజ్ వారు నిర్మిస్తామన్న ఇళ్ల ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

మందస,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):స్థానికతహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మాకొట్టారు. తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటరమణ, రీసర్వే డీటీ సుబ్రహ్మణ్యశర్మ, మండల సర్వేయరు బాబూరావులు మాత్రమే హాజరయ్యారు.

నేటి నుంచి సచివాలయ సిబ్బందికి శిక్షణ

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మంగ, బుధవారాల్లో మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పి-4 కార్యక్రమంలో భాగంగా తరగతులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉపకరణాలకు శిబిరం

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):పాతపట్నంఆల్‌ఆంధ్రరోడ్డులో గల ఎంపీపీ స్కూల్‌లో దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు అందజేసేందుకు అర్హులైన విద్యార్థులను గుర్తించేందుకు మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు ఎస్.సురేష్‌కుమార్, డి. శ్రావణి సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వపాఠశాలల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుచున్న ఆరేళ్లపైబడి 18ఏళ్లలోపు వయసు గల దివ్యాంగ విద్యార్థుల సదరం సర్టిఫికేట్, యూడీఐడీకార్డు, రేషన్‌కార్డులేదా ఆదాయ ధ్రువపత్రం, విద్యార్థి ఫొటోతో హాజరుకావాలని పేర్కొన్నారు.

బాలిగాం అంగన్‌వాడీ కేంద్రం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'కు ఎంపిక

హరిపురం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని బాలిగాం అంగన్‌వాడీ కేంద్రాన్ని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు జిల్లా నోడల్ అధికారి మణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆంధ్ర కోఆపరేషన్ టీం లీడర్ పి.చిరంజీవితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం పరిసరాలు, పోషక ఆహారం అందించే విధానాన్ని అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకుఅనుగుణంగాకేంద్రాన్ని తీర్చిదిద్దాలని కోరారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జె.లక్ష్మి,రామలక్ష్మి పాల్గొన్నారు.

పోలవరంలో వైద్యశిబిరం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలవరంలో స్వస్త్ నారీ-స్వసక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాగ్యశ్రీ, కార్యదర్శి రవి, సర్పంచ్ చిన్నానాయుడు పాల్గొన్నారు.

150 మందికి వైద్యసేవలు

పాతపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీమరలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తీమర, సీది, తామర, పాశిగంగుపేట తదితర గ్రామాలకు చెందిన 150 మందికి వైద్యులు సునీల్ కుమార్, సదాశివ సేవలందించారు. కార్యక్రమంలో ధనుంజయరావు పాల్గొన్నారు.

పాతపట్నంలో యోగా శిక్షణ తరగతులు

పాతపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని ఓం శాంతి నిలయంలో యోగా శిక్షణ తరగతులను ఓం శాంతి ప్రతినిధి నీరజ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక శారీరక ఆరోగ్యాల పరిరక్షణకు యోగా దోహదపడుతుందన్నారు.

పిచ్చిమొక్కలు పెరిగి.. విషసర్పాల బెడద

●భయాందోళన చెందుతున్న సిబ్బంది ● ఇదీ నందిగాం-1, 2 సచివాలయాల ఆవరణలో పరిస్థితి


సచివాలయం భవనం పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

నందిగాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నందిగాం-1, 2 సచివాలయాలు నిర్వహిస్తున్న భవనాలకు ఆనించి పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ సచివాలయాల్లో పనిచేసే సిబ్బందితో పాటు వివిధ పనులు మీద వచ్చే సందర్శకులు కార్యాలయం వెనుక భాగంలో ఉన్న పిచ్చిమొక్కల వల్ల భయాందోళన చెందుతున్నారు. కార్యాలయం వెనుకభాగంలో దట్టంగా మొక్కలు ఉండడంతో విషసర్పాలు సంచరించే అవకాశం ఉండడంతో ఎప్పుడు ఎటువంటి సంఘటనలు జరుగుతాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సచివాలయ పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచి ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

జన సంచారం ఫుల్.. జంగిల్ క్లియరెన్స్ నిల్

●బహిరంగ మలవిసర్జనతో అవస్థలు ● ఇదీ పలాస ఆర్డీవో కార్యాలయం రహదారిలో పరిస్థితి

పలాస రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పలాస ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి నిత్యం జనసంచారంతో రద్దీగా ఉంటోంది. ఈ రహదారిలో జంగిల్ కియరెన్స్ చేయకపోవడంతోపాటు బహిరంగా మలవిసర్జన వల్ల కార్యాలయానికి వచ్చే సందర్శకులు అగచాట్లకు గురవుతున్నారు. ఇక్కడే కాలనీ వాసులు మలవిసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెలువడుతోందని పలువురు వాపోతున్నారు. ఆ రహదారిలోనే ఎస్టీ మెట్రిక్ బాలుర వసతిగృహానికి విద్యార్థులు వచ్చిపోతున్నారు. ఆర్డీవో కార్యాలయానికి ఎనిమిది మండలాల నుంచి రెవెన్యూ అధికారులు,అర్జీదారులు నిత్యం వివిధ పనులపై వస్తున్నారు. ఈనేపథ్యంలో జనసంచారం ఫుల్‌గా ఉన్నా జంగిల్ కియరెన్స్ నిల్ కావడంతో పాములు సంచరిస్తాయని భయాందోళన నెలకొంది. కార్యాలయానికి వెళ్లే రహదారిలో బహిరంగా మలవిసర్జన చేస్తున్నా బ్లీచింగ్ కూడా చేయకపోవడంతో వివిధ పనులపై వచ్చే రెవెన్యూ అధికారులు అవస్థలకు గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్డీవో కార్యాలయం రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేయడంతోపాటురోడ్డుపై బహిరంగ మలవిసర్జన చేయకుండా చర్యలుతీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో పెరిగిన పిచ్చిమొక్కలు